# ప్రపంచంలో మనదే 'యువ దేశం': వెంకయ్య



హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 1 (ఆంధ్ర జ్యోతి): భారత్‌కు ప్రజలే అతిగొప్ప సంపదని, ప్రపంచంలో 'యువ దేశం'గా ఇప్పటికే గుర్తింపు సాధించిందని కేంద్రమంత్రి వెంకయ్య నాయుడు అన్నారు. భారత వ్యయ నియంత్రణ, నిర్వహణ నిపుణుల సంఘం (ఐసీఎఎంఐ) ఆదివారం ఇక్కడ నిర్వహించిన 56వ జాతీయ సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. 'కాస్ట్ మేనేజ్‌మెంట్ అకౌంటెంట్స్' పాత్ర ఇప్పుడు గణనీయంగా పెరిగిందన్నారు. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో వ్యయ నిర్ధారణ, నిర్వహణ నిపుణుల పాత్ర ఎంతో ఉంటుందన్నారు. దేశ జనాభాలో 60 శాతంపైగా 40 ఏళ్లలోపు వారేనన్నారు. వ్యవసాయంలోనూ వ్యయ నియంత్రణ కోసం కాస్ట్ అకౌంటెంట్ నిపుణుల సేవలు అవసరమన్నారు. ఉన్నతవిద్యాఖర్చులు పెరిగాయని, దీని అదుపునకు తగిన సూచనలు చేయాలని నిపుణులను కోరారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన జనధన్ యోజనతో 21 కోట్ల కుటుంబాలకు బ్యాంకు ఖాతాలు ఏర్పడ్డాయన్నారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా సదస్సు ముగింపు సందర్భంగా ప్రచురించిన ప్రత్యేక పుస్తకాన్ని, సీడీని ఆయన ఆవిష్కరించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ సీఎండీ మధుసూదన్ మాట్లాడుతూ- పోటీ తత్వంతో అందుబాటు ధరలు నిర్ణయించడంలోనే వ్యాపార విజయం దాగి ఉందన్నారు. అనంతరం సీయమ్ఎ, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్ ప్రైజెస్ మంత్రి సమక్షంలో అవగాహన ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. ఈ కార్యక్రమం సందర్భంగా వెంకయ్య విలేకరులతో మాట్లాడుతూ- ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు.